ప్రజల్లోకి విస్తృతంగా 'ఆరోగ్య సురక్ష'

- కార్యక్రమ విజయవంతానికి ఉత్తర సమన్వయకర్త కె.కె.రాజు పిలుపు


జేసీఎస్ మండల కన్వీనర్లను సత్కరిస్తున్న ఉత్తర సమన్వయకర్త కె.కె.రాజు

సీతమ్మధార: నియోజకవర్గ పరిధిలో ప్రజలందరికీ జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంపై విస్తృతంగా అవగాహన కల్పించాలని నెడ్‌క్యాప్ చైర్మన్, వైఎస్సార్‌సీపీ ఉత్తర సమన్వయకర్త కె.కె.రాజు పిలుపునిచ్చారు. బాలయ్యశాస్త్రి లేఅవుట్‌లోని పార్టీ కార్యాలయంలో శుక్రవారం కార్పొరేటర్లు, మాజీ కార్పొరేటర్లు, సీనియర్ నాయకులు, డైరెక్టర్లు, వార్డు అధ్యక్షులతో సమావేశం నిర్వహించారు. నియోజకవర్గంలో పలు అభివృద్ధి పనులపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న జగనన్న ఆరోగ్య సురక్ష సేవలను ప్రజలందరూ ఉపయోగించుకునేలా చూడాలన్నారు. ఈ కార్యక్రమ విజయవంతానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. సచివాలయ కన్వీనర్లు, గృహసారథులకు బీమా రిజిస్ట్రేషన్‌లు పూర్తి చేసి రాష్ట్రంలోని 175 నియోజకవర్గాల్లో ఉత్తర మొదటి స్థానం సాధించిన సందర్భంగా జేసీఎస్ మండల కన్వీనర్లను కె.కె.రాజు శాలువాలతో సత్కరించి, పుష్పగుచ్ఛం అందించారు. కార్యక్రమంలో జీవీఎంసీ ఫ్లోర్ లీడర్ బాణాల శ్రీనివాసరావు, డిప్యూటీ ఫ్లోర్ లీడర్ అల్లు శంకరరావు, స్టాండింగ్ కమిటీ మెంబర్లు చల్లా రజని, కంటిపాము కామేశ్వరి, కార్పొరేటర్లు కటారి అనిల్‌కుమార్‌రాజు, సాడి పద్మారెడ్డి, ఆళ్ల లీలావతి, పి.ఉషశ్రీ, రెయ్యి వెంకటరమణ, వి.ప్రసాద్, బర్కత్ అలీ, కె.వి.ఎన్.శశికళ, కో–ఆప్షన్ సభ్యుడు సేనాపతి అప్పారావు, మండల అధ్యక్షులు జి.వి.రమణి, కృష్ణారావు మాస్టార్, పార్టీ వార్డు అధ్యక్షులు నీలి రవి, పైడి రమణ, పీలా వెంకటలక్ష్మి, కె.పి.రత్నాకర్, పి.సునీత, జేసీఎస్ మండల కన్వీనర్లు బులుసు జగదీష్, అమర్‌నాథ్ రెడ్డి, మురళీకృష్ణారెడ్డి, వసంతాల అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

సీతంపేటలో మహా అన్నదానం నేడు

సీతంపేట: దుర్గాగణపతి నవరాత్రి మహోత్సవాల ముగింపు సందర్భంగా శనివారం మధ్యాహ్నం 12 గంటల నుంచి సీతంపేట కూడలిలోని ఆలయం వద్ద మహా అన్నదాన కార్యక్రమం జరుగుతుందని 25వ వార్డు కార్పొరేటర్ సారిపిల్లి గోవింద్ తెలిపారు. సుమారు 5 వేల మందికి అన్నదానానికి ఏర్పాట్లు చేశామని చెప్పారు. భక్తులందరూ భారీగా పాల్గొని అన్న ప్రసాదం స్వీకరించాలని ఆయన కోరారు.

ఉమా నీలకంఠేశ్వరుడికి పూజలు


అన్నప్రసాదం వడ్డిస్తున్న ట్రస్టు సభ్యులు

సీతమ్మధార: నక్కవానిపాలెంలోని ఉమా నీలకంఠేశ్వర స్వామి ఆలయంలో పౌర్ణమి సందర్భంగా శుక్రవారం ప్రత్యేక పూజలు చేశారు. అర్చకుడు రామారావు శర్మ ఆధ్వర్యంలో ఉదయం స్వామి వారికి పంచామృతాభిషేకం నిర్వహించారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం జరిపారు. కార్యక్రమంలో ఆలయ అర్చకులు మహేష్, ఆలయ ట్రస్ట్ చైర్మన్ నక్క అప్పలరెడ్డి, సభ్యులు, సిబ్బంది శేఖర్, భక్తులు పాల్గొన్నారు.

పేద మహిళలకు చీరల పంపిణీ


చీరలు పంపిణీ చేస్తున్న కీర్తి పట్నాయక్

మురళీనగర్: మురళీనగర్‌లోని శ్రీదేవి విజ్ఞాన జ్యోతి పరిష్కార్ చారిటబుల్ ట్రస్ట్ నిర్వహిస్తున్న సేవా కార్యక్రమాల్లో భాగంగా శుక్రవారం ఇంటి పనులు చేసే పేద మహిళలకు చీరలు పంపిణీ చేశారు. ట్రస్ట్ గౌరవ సలహాదారు, రైల్వే సర్కిల్ ఇన్‌స్పెక్టర్ గంగ్రేటి తిరుపతిరావు తల్లి గంగ్రేటి దమయంతి జ్ఞాపకార్థం వీటిని ఆయన విరాళంగా అందించారు. ట్రస్ట్ చైర్‌పర్సన్ కీర్తి పట్నాయక్ మహిళలకు చీరలు అందజేశారు. కార్యక్రమంలో ట్రస్టు సభ్యులు పాల్గొన్నారు.

వివాహిత అదృశ్యం


పద్మావతి

మల్రిపాలెం: కంచరపాలెం ఐదో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో ఓ వివాహిత అదృశ్యమైనట్టు పోలీసులకు ఫిర్యాదు అందింది. వారు తెలిపిన వివరాలిలా.. తమ్మినేని పద్మా వతి అనే మహిళ భర్త గోవిందరావు, కుమార్తె తో కలిసి కంచరపాలెంలో నివసిస్తోంది. వీరికి వివాహమై రెండేళ్లయ్యింది. ఈ నెల 24న ఉదయం ఇంట్లో నుంచి వెళ్లిన వివాహిత తిరిగి ఇంటికి చేరుకోలేదు. దీంతో పద్మావతి సోదరుడు గుజ్జల దివాకర్ కంచరపాలెం పోలీసులకు శుక్రవారం ఫిర్యాదు చేశాడు. ఈమె గతంలో కూడా ఇలాగే ఇంట్లో నుంచి వెళ్లిపోవడంతో తిరిగి తీసుకొచ్చారని పోలీసులు తెలిపారు. సీఐ ఎస్.సాయి నేతృత్వంలో ఎస్ఐ దివ్య భారతి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

1న నారీ శక్తి సమ్మేళనం


వివరాలు వెల్లడిస్తున్న ధరణి ప్రియ

సీతమ్మధార: అక్టోబర్ 1న వైజాగ్ కన్వెన్షన్ సెంటర్‌లో వెయ్యి మంది మహిళలతో నారీ శక్తి సమ్మేళనం నిర్వహించనున్నట్లు సంస్థ అధినేత ధరణి ప్రియ తెలిపారు. గురుద్వారా దరి ఒక హోటల్‌లో శుక్రవారం విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. చంద్రయాన్–3 విజయవంతంలో మహిళలు కీలక పాత్ర పోషించారన్నారు. సమాజ అభివృద్ధి, వికాసం కోసం మహిళల పాత్ర పెంచడమే నారీ యోజన ఉద్దేశమని చెప్పారు. నారీ శక్తి సమ్మేళనంలో మహిళల సమస్యలు తెలుసుకుని పరిష్కరిస్తామని, 90 ఏళ్ల ప్రొఫెసర్ శాంతమ్మతో పాటు పలువురిని సన్మానిస్తామని వెల్లడించారు. ఉదయం 10 నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు కార్యక్రమం జరుగుతుందని చెప్పారు. స్థ కో ఆర్డినేటర్ ఉమాదేవి, సమన్వయకర్త వెంకటభాను పాల్గొన్నారు.

'జగనన్నకు వందనం' పోస్టర్ ఆవిష్కరణ


పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కె.కె.రాజు తదితరులు

సీతమ్మధార: ఆంధ్రప్రదేశ్ గ్రామ/వార్డు సచివాలయ ఎంప్లాయీస్ ఫెడరేషన్ విశాఖపట్నం ఆధ్వర్యంలో శుక్రవారం జగనన్నకు వందనం పోస్టర్‌ను నెడ్‌క్యాప్ చైర్మన్, వైఎస్సార్‌సీపీ ఉత్తర సమన్వయకర్త కె.కె.రాజు ఆవిష్కరించారు. బాలయ్యశాస్త్రి లేఅవుట్‌లోని పార్టీ కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో వారు మాట్లాడుతూ అక్టోబర్ 2 నాటికి సచివాలయ వ్యవస్థ ఏర్పాటు చేసి నాలుగేళ్లు పూర్తికానున్న సందర్భంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలుపుతూ ఈ పోస్టర్‌ను ఆవిష్కరించామన్నారు. ఫెడరేషన్ జిల్లా అధ్యక్షుడు పి.జె.గణేష్‌కుమార్, ప్రధాన కార్యదర్శి అనిమరెడ్డి, రమణ తదితరులు పాల్గొన్నారు.

సింహగిరిపై ఆర్జిత సేవలు పునః ప్రారంభం

సింహాచలం: సింహగిరిపై శ్రీ వరాహ లక్ష్మీనృసింహ స్వామి ఆలయంలో శుక్రవారం నుంచి ఆర్జిత సేవలు పునఃప్రారంభమయ్యాయి. పవిత్రోత్సవాల సందర్భంగా ఈ నెల 24 నుంచి 28 వరకు అన్ని ఆర్జిత సేవలు రద్దు చేసిన విషయం తెలిసిందే. పవిత్రోత్సవాలు ముగియడంతో తిరిగి ఆర్జిత సేవలను పునరుద్ధరించారు. ఉదయం 9.30 నుంచి నిత్యకల్యాణం శాస్త్రోక్తంగా నిర్వహించారు. స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి,భూదేవిలను ఆలయ కల్యాణ మండపంలోని వేదికపై అధిష్టంపజేశారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు తదితర ఘట్టాలతో కల్యాణం శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి ప్రసాదం, శేషవస్త్రాలు అందజేశారు. శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి కి గరుడ సేవ ఘనంగా నిర్వహించారు.

మంత్రి కారుమూరి దృష్టికి సమస్యలు


మంత్రి కారుమూరి నాగేశ్వరరావును కలిసిన ఎండీయూ ఆపరేటర్ల యూనియన్ ప్రతినిధులు

తాటిచెట్లపాలెం: నగరంలో పర్యటిస్తున్న రాష్ట్ర పౌర సరఫరాలు, వినియోగదారుల శాఖ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావును ప్రభుత్వ అతిథి గృహంలో శుక్రవారం రాష్ట్ర సమైఖ్య ఎండీయూ ఆపరేటర్ల యూనియన్ ప్రతినిధులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయన దృష్టికి రేషన్ సరఫరా చేస్తున్న ఎండీయూ ఆపరేటర్ల సమస్యలను తీసుకెళ్లారు. ఇటీవల కాలంలో రేషన్ సరకుల పంపిణీ విషయంలో రెండు సార్లు వేలిముద్రలు తీసుకోవడం కొంత ఇబ్బందిగా ఉందని, ఒక్కో వినియోగదారుడికి అధిక సమయం పడుతోందని వివరించారు. కరోనా, ఇతర అనారోగ్య కారణాలతో మృతిచెందిన ఆపరేటర్ల కుటుంబాలను ఆదుకోవాలని విన్నవించారు. ఎండీయూ ఆపరేటర్లకు ఉద్యోగ భద్రత కల్పించాలని, అంగన్‌వాడీ సెంటర్లకు సరఫరా చేసే సరకులకు కమిషన్ పెంచేలా చూడాలని మంత్రిని యూనియన్ ప్రతినిధులు కోరారు.

'గ్రీవెన్స్'తో వినతుల పరిష్కారం


ప్రజల సమస్యలు తెలుసుకుంటున్న కె.కె.రాజు

సీతమ్మధార: బాలయ్యశాస్త్రి లేఅవుట్‌లోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో శుక్రవారం నెడ్‌క్యాప్ చైర్మన్, పార్టీ ఉత్తర సమన్వయకర్త కె.కె.రాజు ఆధ్వర్యంలో గ్రీవెన్స్ కార్యక్రమం నిర్వహించారు. నియోజకవర్గంలోని పలు వార్డులకు చెందిన ప్రజలు తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఆయనకు వినతిపత్రాలు అందజేశారు. వాటిని కె.కె.రాజు పరిశీలించి కొన్ని అర్జీలను వెంటనే పరిష్కరించారు. మిగిలిన వినతులను సంబంధిత అధికారులకు పంపి త్వరలోనే పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.

మహిళలు అన్నివేళలా అప్రమత్తంగా ఉండాలి


మహిళలకు అవగాహన కల్పిస్తున్న సీఐ విజయకుమార్

సీతమ్మధార: ప్రతి ఒక్కరూ తమ ఇంటి వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని ఫోర్త్‌టౌన్ లా అండ్ ఆర్డర్ సీఐ ఎస్.విజయకుమార్ సూచించారు. ఒక సీసీ కెమెరా వంద మంది కానిస్టేబుళ్లతో సమానమన్నారు. దొండపర్తి సమీపంలోని సుబ్బలక్ష్మి కల్యాణ మండపంలో శుక్రవారం మహిళలకు ఫోర్త్‌టౌన్ పోలీసులు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ ఇటీవల ఎక్కువ మంది ఆత్మహత్యలకు పాల్పడుతున్నారన్నారు. ఆత్మహత్య ఆలోచనను మానుకుని సమస్యలు పరిష్కరించుకునే దిశగా ముందుకు సాగాలని హితవు పలికారు. మహిళలు అన్నివేళలా అప్రమత్తంగా ఉండాలని, వాకింగ్ చేసేటప్పుడు బంగారు నగలు కనిపించకుండా జాగ్రత్తగా ఉండాలన్నారు. మైనర్లకు ద్విచక్ర వాహనాలు ఇవ్వరాదని తల్లిదండ్రులకు సూచించారు. ఇంటి చుట్టుపక్కలా ఎవరైనా అనుమానాస్పదంగా కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారమివ్వాలని కోరారు. బంగారు ఆభరణాలు, నగదును బ్యాంక్ లాకర్‌లో భద్రంగా ఉంచుకోవాలన్నారు. కార్యక్రమంలో మహిళా పోలీసులు, వలంటీర్లు, స్థానిక మహిళలు పాల్గొన్నారు.

రమణికుమారికి అభినందనలు


పేడాడ రమణికుమారిని సత్కరిస్తున్న కోలా గురువులు తదితరులు

కొమ్మాది: ఎండాడలో గల వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యాలయంలో శుక్రవారం పేడాడ రమణికుమారిని పార్టీ జిల్లా అధ్యక్షుడు కోలా గురువులు అభినందించి సత్కరించారు. ఇటీవల ఆమెను అంబేడ్కర్ యూనివర్సిటీ పాలక మండలి సభ్యురాలిగా నియమించారు. ఈ సందర్భంగా ఆమెను సత్కరించారు. పార్టీని నమ్ముకున్నవారికి సముచిత స్థానం లభిస్తుందని కోలా గురువులు పేర్కొన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ సాంస్కృతిక విభాగం రీజినల్ కో ఆర్డినేటర్ వంకాయల మారుతీ ప్రసాద్, బాబ్జి తదితరులు పాల్గొన్నారు.

భాగ్యలక్ష్మికి సత్కారం


మిసెస్ ఇండియా ఆంధ్రప్రదేశ్ విన్నర్ భాగ్యలక్ష్మిని సత్కరిస్తున్న నాగమల్లేశ్వరి

సీతంపేట: న్యూ హోప్ ఫౌండేషన్ వ్యవస్థాపకురాలు డాక్టర్ మంచా నాగమల్లేశ్వరి ఆధ్వర్యంలో ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో శుక్రవారం మిసెస్ ఇండియా ఆంధ్రప్రదేశ్ 2023 విన్నర్ కొణతాల భాగ్యలక్ష్మిని ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా నాగమల్లేశ్వరి మాట్లాడుతూ విజయనగరం జిల్లా చీపురుపల్లికి చెందిన భాగ్యలక్ష్మి అక్షయ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 24న హైదరాబాద్‌లో నిర్వహించిన రాష్ట్ర స్థాయి పోటీల్లో విజేతగా నిలవడం ఆనందంగా ఉందన్నారు. మిస్ అండ్ మిసెస్ ఉత్తరాంధ్ర 2022లో విజేతగా నిలిచిన భాగ్యలక్ష్మి.. రాష్ట్ర స్థాయిలో గుర్తింపు తెచ్చుకోవడం సంతోషమన్నారు. భాగ్యలక్ష్మి మాట్లాడుతూ ఈ రంగంలో ముందుకెళ్లడానికి మల్లేశ్వరి ఎంతో ప్రోత్సహించారన్నారు. కార్యక్రమంలో పారిశ్రామికవేత్త రమేష్, వైజాగ్ ప్రాపర్టీస్ చైర్మన్ సురేష్, సీబీఎన్ కాంపౌండ్ వైస్ ప్రెసిడెంట్ మంజు పాల్గొన్నారు.

భర్త వేధింపులపై ఫిర్యాదు

మల్రిపాలెం: తన భర్త తనను వేధిస్తున్నాడంటూ ఓ భార్య కంచరపాలెం ఐదో పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు తెలిపిన వివరాలిలా.. నేదూరి యమున అనే వివాహిత భర్త సన్యాసిరావు, కుమారుడు, కుమార్తెతో కలిసి కొత్తరెడ్డి కంచరపాలెంలో నివసిస్తోంది. వీరికి వివాహమై 10 ఏళ్లు అయ్యింది. తరచూ భర్త తనను శారీరికంగా, మానసికంగా వేధిస్తున్నాడని, దుర్భాషలాడటం, కొట్టడంతో శుక్రవారం ఆమె కంచరపాలెం పోలీసులకు ఫిర్యాదు చేసింది. సీఐ ఎస్.సాయి నేతృత్వంలో ఉమెన్ హెడ్ కానిస్టేబుల్ కృష్ణకుమారి కేసు దర్యాప్తు చేపట్టారు.

పాఠశాలల్లో 'నా మట్టి.. నా దేశం'


ఎన్జీజీవోస్ కాలనీ హైస్కూల్‌లో అమృత కలశం తయారు చేస్తున్న ఉపాధ్యాయులు

సీతంపేట: విద్యా శాఖ మంత్రి, ప్రిన్సిపల్ సెక్రటరీ ఆదేశాల మేరకు శుక్రవారం ఉత్తర నియోజకవర్గంలోని జీవీఎంసీ పాఠశాలల్లో నా మట్టి.. నా దేశం కార్యక్రమం నిర్వహించారు. అక్కయ్యపాలెం ఎన్జీజీవోస్ కాలనీ జీవీఎంసీ హైస్కూల్, భవిత సెంటర్, వెంకటేశ్వర కాలనీ జీవీఎంసీ ప్రాథమిక పాఠశాలల్లో ఈ కార్యక్రమం జరిగింది. ఉపాధ్యాయులు, తల్లిదండ్రుల కమిటీల సభ్యులు పాల్గొని మట్టిని సేకరించి అమృత కలశాన్ని తయారు చేశారు. దానితో ర్యాలీ నిర్వహించారు. ఈ కలశాన్ని ఎంఈవో కార్యాలయానికి అందజేస్తామని హెచ్ఎంలు బి.లక్ష్మీనరస, ఎస్.వి.దొర తెలిపారు.

హిందూ ముస్లిం యువత అన్నదానం


అన్నప్రసాదం వడ్డిస్తున్న పోతు సత్యనారాయణ

సీతంపేట: జీవీఎంసీ 26వ వార్డు చిన్నూరు వద్ద వలీ బాయ్స్ ఆధ్వర్యంలో జరిగిన వినాయక ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం హిందూ ముస్లిం యువత 2 వేల మందికి అన్నదానం చేశారు. ముఖ్య అతిథి వైఎస్సార్‌సీపీ నాయకుడు పోతు సత్యనారాయణ భక్తులకు అన్నప్రసాదం వడ్డించారు. కార్యక్రమంలో షేర్వాలి, ఇర్ఫాజ్, వలీ, షఫీ, సలీం, సాగర్, నానీ, జగన్, దొరబాబు, స్థానిక యువత పాల్గొన్నారు.

జాబ్ మేళాకు విశేష స్పందన


అభ్యర్థులకు సూచనలిస్తున్న ఎంప్లాయిమెంట్ అధికారి సుబ్బిరెడ్డి

కంచరపాలెం: స్థానిక జిల్లా ఉపాధి కార్యాలయం నేషనల్ కెరీర్ సర్వీస్ సెంటర్‌లో ఆంధ్రప్రదేశ్ డిపార్ట్‌మెంట్ ఆఫ్ స్కిల్ డెవలప్‌మెంట్ అండ్ ట్రైనింగ్ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన మెగా జాబ్ మేళాకు విశేష స్పందన లభించింది. ఈ సందర్భంగా అభ్యర్థులకు జిల్లా ఎంప్లాయిమెంట్ అధికారి సిహెచ్.సుబ్బిరెడ్డి(క్లరికల్) పలు సూచనలిచ్చి మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం నిరుద్యోగులకు పలు కంపెనీల్లో ఉద్యోగ అవకాశాలను కల్పించేందుకు ఎంతో కృషి చేస్తోందన్నారు. జాబ్‌మేళాలో ఎంతో మంది ఉద్యోగాలు పొందారని చెప్పారు. ఫ్లిప్‌కార్ట్, వరుణ్ మోటార్స్, సుస్వాదీప్ ఆగ్రో సర్వీసెస్, పైనీర్ ఎలాస్టిక్, రవి రేస్(ఇండియన్ ఆయిల్ డీలర్స్), పేటీఎం సర్వీసెస్, రిలయన్స్ ట్రెండ్స్, ముత్తూట్ ఫైనాన్స్ ప్రైవేటు లిమిటెడ్ కంపెనీల్లో 616 ఖాళీల భర్తీకి నిర్వహించిన ఇంటర్వ్యూల్లో 230 మంది అభ్యర్థులు హాజరు కాగా.. 75 మంది ఎంపికైనట్లు సంస్థ ప్రతినిధులు తెలిపారు. వారికి సుబ్బిరెడ్డి చేతుల మీదుగా నియామక పత్రాలు అందజేశారు.

వ్యక్తిపై దాడి చేసిన ముగ్గురి అరెస్ట్

సీతమ్మధార: రైల్వే న్యూకాలనీ సమీపంలో హైదరాబాద్‌కు చెందిన నిఖిల్ అనే వ్యక్తిపై దాడి చేసి డబ్బులు కాజేసిన ముగ్గురు యువకులను నాలుగో పట్టణ పోలీసులు శుక్రవారం అరెస్టు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. హైదరాబాద్‌కు చెందిన నిఖిల్ రైల్వే న్యూకాలనీలో ఉన్న ఒక హోటల్‌లో దిగాడు. గణపతి విగ్రహాల ఊరేగింపు చూడటానికి బయటకు వెళ్లి గురువారం అర్ధరాత్రి 12 గంటలకు హోటల్‌కు వెళ్తున్న సమయంలో న్యూకాలనీ వద్ద కాజా, బండారు లక్ష్మిత్, వెంకట సిద్ధార్థలు అడ్డుకున్నారు. నిఖిల్‌ను చితకబాది అతడి వద్ద ఉన్న డబ్బును దోచుకొని పారిపోయారు. దీంతో బాధితుడు నిఖిల్ ఫోర్త్ టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. సీఐ విజయ్‌కుమార్ దాడి చేసిన ముగ్గురిని గుర్తించి అరెస్టు చేశారు.

బాలల హక్కుల పరిరక్షణకు ప్రాధాన్యం


పోలీస్ కమిషనర్ రవిశంకర్‌కు పుష్పగుచ్ఛం అందిస్తున్న గొండు సీతారాం

సీతమ్మధార: బాలల హక్కుల పరిరక్షణ నగరంగా విశాఖను తీర్చిదిద్దుదామని పోలీస్ కమిషనర్ డాక్టర్ రవిశంకర్ అయ్యనార్ అన్నారు. ఇటీవల నగర సీపీగా బాధ్యతలు చేపట్టిన ఆయనను చాంబర్‌లో శుక్రవారం రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యుడు గొండు సీతారాం మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించారు. అనంతరం కమిషనర్‌తో ఆయన భేటీ అయి వివిధ అంశాలపై చర్చించారు. బాలల భిక్షాటన, బాల కార్మిక వ్యవస్థ, బాలల అక్రమ రవాణా, బాల్య వివాహాలు, వివిధ పిల్లల కేసులు, కారణాలు, ప్రభావిత అంశాల గురించి ప్రస్తావించారు. ఈ సందర్భంగా సీపీ రవిశంకర్ మాట్లాడుతూ బాలల హక్కుల పరిరక్షణ, భద్రతను దృష్టిలో ఉంచుకొని నగరంలోని అన్ని పోలీస్ స్టేషన్లకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేస్తామన్నారు. బాలల స్నేహపూర్వక స్టేషన్లుగా తీర్చిదిద్దేందుకు ప్రణాళికలతో అడుగులు వేస్తామని చెప్పారు. పోలీస్ అధికారులను సమన్వయ పరిచి, పిల్లలకు సంబంధించి అన్ని అంశాల పరిష్కారానికి సమావేశాలను ఏర్పాటు చేస్తామన్నారు. గొండు సీతారాం మాట్లాడుతూ వివిధ అంశాల పరిష్కారం దిశగా సీపీతో భేటీలో చర్చకు రావడం హర్షణీయమన్నారు. కార్యక్రమంలో జిల్లా ప్రొబెషనరీ ఆఫీసర్ ఎం.శరత్ పాల్గొన్నారు.

అంతర్జాతీయ అహింసా దినంగా గాంధీ జయంతి


పోస్టర్లు ఆవిష్కరిస్తున్న ఆచార్య బాలమోహన్‌దాస్, నరవ ప్రకాశరావు

సీతంపేట: ఐక్య రాజ్య సమితి ఆదేశాల మేరకు గాంధీ జయంతిని అంతర్జాతీయ అహింసా దినంగా పాటిద్దామని బీవీ ఫౌండేషన్ ఫర్ పీస్ అండ్ హార్మోనీ సంస్థ కార్యదర్శి నరవ ప్రకాశరావు పిలుపునిచ్చారు. దీనికి సంబంధించిన పోస్టర్లను శుక్రవారం డాక్టర్ లంకపల్లి బుల్లయ్య కళాశాలలోని గాంధీ సెంటర్‌లో ఆచార్య బాలమోహన్‌దాస్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గాంధీ చూపిన అహింసా సిద్ధాంతం ప్రపంచ దేశాలకు మార్గదర్శకమైందని, అందుకే ప్రపంచ దేశాలు అక్టోబర్ 2ను అంతర్జాతీయ అహింసా దినంగా పాటిస్తున్నారని తెలిపారు. ప్రతి ఒక్కరూ చిన్నతనం నుంచే శాంతి, సామరస్యం కలిగి ఉండాలని హితవు పలికారు. కార్యక్రమంలో గాంధీ సెంటర్ సహాయ కార్యదర్శి సత్యమూర్తి పాల్గొన్నారు.

శ్రీనివాసరాజుకు మహాత్మా గాంధీ ఫెలోషిప్ పురస్కారం



తాటిచెట్లపాలెం: కైలాసపురం వాకర్స్ హెల్త్ క్లబ్ వ్యవస్థాపకుడు చింతలపాటి శ్రీనివాసరాజుకు మహాత్మా గాంధీ ఫెలోషిప్ పురస్కారాన్ని వాకర్స్ ఇంటర్నేషనల్ ప్రకటించింది. వాకర్స్ ఇంటర్నేషనల్ డిస్ట్రిక్ట్ 101 గవర్నర్ ఉప్పలపాటి శుభ అధ్యక్షతన మురళీనగర్‌లోని ప్రైవేట్ ఫంక్షన్ హాల్లో మురళీనగర్ వనితా వాకర్స్ క్లబ్ అధ్యక్షురాలు ప్రభాశర్మ చేతుల మీదుగా అక్టోబర్ 1న జరిగే 4వ క్యాబినెట్ సమావేశంలో ఈ పురస్కారాన్ని అందజేయనున్నారు. శ్రీనివాసరాజు 2006లో కైలాసపురంలో వాకర్స్ హెల్త్ క్లబ్‌ను స్థాపించి అనేక ఉచిత వైద్య శిబిరాలు నిర్వహించారు. శ్రీవారి సేవా వలంటీర్స్ అసోసియేషన్ వ్యవస్థాపక కో ఆర్డినేటర్‌గా 12 వేల మంది స్వచ్ఛంద సేవలకులను తీర్చిదిద్దారు. మాస్టర్ ఈకే జనకులం, శ్రీవారి సేవాబృందం, గ్రేటర్ విశాఖ సర్వోదయ మండలి, విశాఖ వలంటీర్ వెల్ఫేర్ సొసైటీ వంటి పలు స్వచ్ఛంద సేవా సంస్థల సమన్వయంలో వివిధ సేవలందించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్వహించే స్వచ్ఛ భారత్, స్వచ్ఛ సర్వేక్షణ్, బీచ్ క్లీనింగ్ వంటి కార్యక్రమాల్లో కూడా పాల్గొన్నారు. ఈ సందర్భంగా శ్రీనివాసరాజును వాకర్స్ ఇంటర్నేషనల్ అధ్యక్షుడు డాక్టర్ ఎస్.పి.రవీంద్ర, ఏరియా వైస్ ప్రెసిడెంట్ డాక్టర్ డి.డి. నాయుడు, కార్యదర్శి కె.ద్వారకానాథ్, ఉప్పలపాటి శుభ, ప్రభాశర్మలు అభినందించారు.

కారు ఢీకొని వృద్ధుడికి గాయాలు

మల్రిపాలెం: కంచరపాలెం ఐదో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వృద్ధుడికి గాయాలయ్యాయి. పోలీసులు తెలిపిన వివరాలిలా.. బర్మాక్యాంప్ దరి శ్రీనివాసనగర్‌లో నివసిస్తున్న డి.పెంటారావు(67) గురువారం సాయంత్రం బయటకు వెళ్లి ఇంటికి వస్తున్న క్రమంలో కైలాసపురం వద్ద అదే మార్గంలో వస్తున్న ఓ గుర్తు తెలియని కారు అతడిని వెనుక నుంచి ఢీకొని వెళ్లిపోయింది. వృద్ధుడు కిందపడిపోవడంతో గాయాలయ్యాయి. పెంటారావును చికిత్స కోసం ఆస్పత్రికి తరలించారు. క్షతగాత్రుడి ఫిర్యాదు మేరకు సీఐ ఎస్.సాయి నేతృత్వంలో ఏఎస్ఐ రాజారావు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

దసరా ఉత్సవాలకు ఏర్పాట్లు

మురళీనగర్: మురళీనగర్ రామాలయంలో కొలువైన లలితా దేవి ఆలయంలో శరన్నవరాత్రి ఉత్సవాల నిర్వహణకు ఏర్పాట్లు చేసినట్లు ఆలయ కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు టీఎస్ రెడ్డి, సనపల వరప్రసాద్ తెలిపారు. ఉత్సవాల కరపత్రాలను శుక్రవారం ఆలయంలో వారు ఆవిష్కరించారు.

మృగాళ్లను కఠినంగా శిక్షించాలి

కంచరపాలెం: ఆడ పిల్లలపై చెలరేగిపోతున్న మృగాళ్లకు కఠిన శిక్షలు విధించాలని దళిత సేన రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ గొల్లమాల అప్పారావు డిమాండ్ చేశారు. మధ్యప్రదేశ్‌లో బాలికపై జరిగిన అమానుష ఘటనను ఖండిస్తూ శుక్రవారం ఊర్వశి జంక్షన్‌లోని దళిత సేన కార్యాలయంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఆయన మాట్లాడుతూ ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాల్సిన బాధ్యత కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై ఉందన్నారు. బాధిత బాలికకు న్యాయం చేయాలని, నిందితులను కఠినంగా శిక్షించాలన్నారు. దళిత సేన నగర అధ్యక్షుడు పుచ్చ కామేశ్వరరావు, ఉపాధ్యక్షుడు తాటిపూడి సీతారామ్, ప్రధాన కార్యదర్శి చింతల మల్లికార్జునరావు, లంకా రామారావు, పట్నాల ఝాన్సీరాణి, నగర కన్వీనర్ గొల్లమాల మీనా, రాంజీ అభ్యుదయ సేవా సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం


నగదు అందిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

కంచరపాలెం: జీవీఎంసీ 55వ వార్డు జాషువానగర్ సచివాలయం పరిధిలో నివసిస్తున్న బెలగాపు వెంకటరమణ కుమార్తె ఇటీవల ప్రమాదానికి గురైంది. విషయం తెలుసుకున్న కార్పొరేటర్ కె.వి.ఎన్.శశికళ నేతృత్వంలో వైఎస్సార్‌సీపీ నాయకులు శుక్రవారం రూ.10 వేల ఆర్థిక సాయాన్ని బాధిత కుటుంబానికి అందించారు. కార్యక్రమంలో ధర్మేంద్రరెడ్డి, దివాకర్ రెడ్డి, శ్రీనివాసరెడ్డి, రమణారెడ్డి, రాజేష్‌రెడ్డి, సంతోష్, రాజు, బుజ్జి, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

వైభవోపేతం.. కాళీ కాలభైరవుల కల్యాణోత్సవం


లలితా పీఠంలో కాళీ కాలభైరవుల కల్యాణం నిర్వహిస్తున్న వేద పండితులు

సీతంపేట: లలితానగర్ లలితా పీఠంలో శుక్రవారం కాళీ కాలభైరవుల కల్యాణ మహోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది. కుర్తాళం శంకరాచార్య, లలితా పీఠాధిపతి సిద్ధేశ్వరానంద భారతీ మహాస్వామి సమక్షంలో వేద పండితుల మంత్రోచ్ఛారణల నడుమ శాస్త్రోక్తంగా కల్యాణం జరిపించారు. కుర్తాళం పీఠ ఆస్థాన పండితులు మాచవోలు రమేష్ శర్మ నేతృత్వంలో పీఠం దర్బారు హాల్లో సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దిన కల్యాణ వేదికపై కాళీ కాలభైరవుల ఉత్సవ మూర్తులకు వైభవంగా కల్యాణం చేశారు. సుమూహూర్తం, మాంగల్యధారణ, తలంబ్రాల ఘట్టాలు కళ్లకు కట్టినట్టు చూపారు. కాళీ కాలభైరవుల కల్యాణ విశిష్టతను వివరించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పరిణయాన్ని వీక్షించారు. వారికి తీర్థ ప్రసాదాలు, తలంబ్రాలు అందజేశారు. పీఠం మేనేజర్ మన్నవ కృష్ణసేన్ ఏర్పాట్లు పర్యవేక్షించారు.